నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, శుక్రవారం 26 జనవరి 2024 | KAMAREDDY




ఓటు హక్కుపై అవగాహన కలిగించేలా వేసిన ముగ్గును పరిశీలిస్తున్న కామారెడ్డి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్




## ప్రజాస్వామ్య పరిరక్షణలో
# ఓటే కీలకం

- ఓటు విలువను ప్రతిఒక్కరూ గుర్తించాలి
- ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, అధికారులు
- సీనియర్ సిటిజన్లు, కొత్త ఓటర్లకు సత్కారం

కంఠేశ్వర్/ కామారెడ్డి, జనవరి 25 : ఉమ్మడి జిల్లాలో గురువారం 14వ జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. నిజామాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్, కామారెడ్డిలో కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఎంతో విలువైన ఓటుహక్కు ప్రాధాన్యతను ప్రతిఒక్కరూ గుర్తెరగాలని సూచించారు. 18 ఏండ్లు నిండిన వారందరూ ఓటరుగా నమోదు కావడంతోపాటు ఎన్నికల్లో విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో మనకు నచ్చిన నాయకులను ఎన్నుకునే అవకాశం కేవలం ఓటు హక్కు ద్వారానే సాధ్యమని పేర్కొన్నారు. ఒక్క ఓటుతో ఏమవుతుందనే భావన ఎంతమాత్రం సరికాదని, ప్రజాస్వామ్య పరిరక్షణలో మంచి పాలకులను ఎన్నుకోవడంలో ప్రతిఓటూ ఎంతో కీలకమని తెలిపారు. అనంతరం ఓటు వినియోగించుకుంటున్న సీనియర్ సిటిజన్లను, కొత్తగా నమోదైన యువ ఓటర్లను జిల్లా యంత్రాంగం తరపున జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

కామారెడ్డి కలెక్టరేట్ ఆవరణలో ఓటు హక్కుపై వేసిన ముగ్గు ఆలోచింపజేయగా.. కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కలెక్టర్లు, ఆర్డీవోలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



నిజామాబాద్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, సీపీ, అదనపు కలెక్టర్లు, అధికారులు

# గణతంత్ర ఉత్సవాలకు ముస్తాబు

- ఏర్పాట్లు పూర్తిచేసిన యంత్రాంగం

*'గణతంత్ర' వేడుకలకు ఉమ్మడి జిల్లా ముస్తాబైంది. శుక్రవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిజామాబాద్, కామారెడ్డి జిల్లా కేంద్రాల్లో అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేసింది. కామారెడ్డి కలెక్టరేట్‌లో కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, నిజామాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఉదయం 9 గంటలకు జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. రిపబ్లిక్ డే వేడుకకు ప్రజాప్రతినిధులు, పురప్రముఖులు విచ్చేయనున్న నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఇదివరకే నిర్వహించిన సమీక్షలో అధికారులకు సూచించారు. వేదిక, ఎగ్జిబిషన్ స్టాల్స్, శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర ఏర్పాట్లపై పోలీసు, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి కీలక సూచనలు చేశారు. ఈ మేరకు సంబంధిత అధికారులు పోలీసు పరేడ్ మైదానంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. కోర్టులు, అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో రిపబ్లిక్ వేడుకలు నిర్వహించనున్నారు.*

*–కామారెడ్డి/ కంఠేశ్వర్, జనవరి 25*


విద్యుద్దీపాల వెలుగుల్లో కామారెడ్డి కలెక్టరేట్


నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పరేడ్ మైదానంలో ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

# కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్

కామారెడ్డి, జనవరి 25 : బీఆర్‌ఎస్ కార్యకర్తలు ప్రమాదవశాత్తు మృతి చెందగా.. బాధిత కుటుంబ సభ్యులకు మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఆయన నివాసంలో గురువారం పార్టీ ప్రమాద బీమా చెక్కులను పంపిణీ చేశారు. కామారెడ్డి నియోజకవర్గంలో మాచారెడ్డి మండలం మైసమ్మ చెరువు తండాకు చెందిన అజ్మీరా సీతారాం మృతి చెందగా అతని భార్య మంగ్యాకు చెక్కును అందజేశారు. దోమకొండ మండలం అంబారీపేట్ గ్రామానికి చెందిన సిరికొండ లింగారెడ్డి మృతి చెందగా అతని భార్య సరితకు, మద్దికుంటకు చెందిన గజ్జెల లింగం మృతి చెందగా అతని భార్య తులసమ్మ, కామారెడ్డి మండలం సరంపల్లి గ్రామానికి చెందిన ఆకుల లింగం మృతి చెందగా అతని భార్య లావణ్య, తిప్పాపూర్ గ్రామానికి చెందిన ఎల్లవ్వ మృతి చెందగా ఆమె భర్త భిక్షపతికి ఒక్కొక్కరికీ రూ.2 లక్షల చొప్పున మొత్తం రూ.10 లక్షల బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వ బీమా నుంచి మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ప్రభుత్వ విప్ మాట్లాడుతూ.. కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. ప్రమాదవశాత్తు కార్యకర్తలు మృతి చెందితే వారి కుటుంబాలకు పార్టీ బీమా నుంచి ఆర్థికసాయం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్ రెడ్డి, నల్లవెల్లి అశోక్, గెరిగంటి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేస్తున్న మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

## చరిత్ర శోధకుడు 'కందకుర్తి'కి ఎమ్మెల్సీ కవిత అభినందన

సుభాష్‌నగర్, జనవరి 25: నిజామాబాద్ జిల్లాకు చెందిన ప్రముఖ చరిత్ర పరిశోధకుడు కందకుర్తి యాదవ్‌రావు జాతీయస్థాయి పురస్కారం అందుకోగా.. ఎమ్మెల్సీ కవిత అభినందించారు. హైదరాబాద్ గచ్చిబౌలిలో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ నేషనల్ ఉర్దూ విశ్వవిద్యాలయంలో బుధవారం రాత్రి నిర్వహించిన తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ సమావేశంలో యాదవ్‌రావు పలు చారిత్రక అంశాలపై సుదీర్ఘ ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా వర్సిటీ ఉపకులపతి ఆచార్య సయ్యద్ హిదుల్ హసన్, ప్రతినిధులు రాధికా శేషన్, అర్జున్‌రావు తదితరులు యాదవ్‌రావుకు జాతీయ స్థాయి పురస్కారం ప్రదానం చేశారు. నిజామాబాద్ బిడ్డ కందకుర్తి యాదవ్‌రావుకు జాతీయ పురస్కారం రావడం సంతోషంగా ఉందని, రాష్ట్రానికి,జిల్లాకు గర్వకారణమని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. జిల్లా ప్రజలు, తన తరపున యాదవ్‌రావుకు ట్విట్టర్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు.

# రైస్‌మిల్లులపై కొరడా

- సీఎంఆర్ నిర్లక్ష్యంపై క్రిమినల్ కేసులు
- ఇప్పటి వరకు ఎనిమిది రైస్ మిల్లులపై చర్యలు
- ఒక్క వర్ని మండలంలోనే నాలుగు మిల్లులు..
- ధాన్యం పక్కదారి పట్టించిన అక్రమార్కుల్లో వణుకు..
- పౌరసరఫరాల శాఖ విస్తృత తనిఖీలు

నిజామాబాద్, జనవరి 25
(నమస్తే తెలంగాణ ప్రతినిధి):


కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) అందజేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్న రైస్‌మిల్లులపై ప్రభుత్వం కొరడా ఝుళిపిస్తోంది. ప్రభుత్వం నుంచి ధాన్యం స్వీకరించి నిబంధనల మేరకు మర ఆడించిన బియ్యాన్ని తిరిగి ఇవ్వడంలో వైఫల్యం చెందిన రైస్ మిల్లుల్లో పౌరసరఫరాల శాఖ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. తనిఖీల్లో ధాన్యాన్ని పక్కదారి పట్టించి బియ్యం సరఫరాలో చేతులెత్తేసిన రైస్ మిల్లుల యాజమాన్యాలపై ఏకంగా క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నారు. పౌరసరఫరాల సంస్థ మేనేజర్ జగదీశ్ ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. సమయానికి సీఎంఆర్ అందించకుండా తాత్సారం చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని పౌరసరఫరాల శాఖ స్పష్టం చేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నట్లు ఆ శాఖ అధికారులు ప్రకటించారు. సీఎంఆర్ ఇవ్వడంలో జాప్యం చేసే వారికి భవిష్యత్తులోనూ ఇబ్బందులు తప్పవని హెచ్చరిస్తున్నారు. రాబోయే రోజుల్లో అలాంటి వారికి ధాన్యం కేటాయింపులు సైతం ఉండబోవని స్పష్టం చేస్తున్నారు. రైస్‌మిల్లులను బ్లాక్ లిస్టులో పెట్టడంతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నారు. దీంతో మిల్లుల రైస్‌మిల్లుల యాజమాన్యాల్లో వణుకుమొదలైంది.



### 8 రైస్ మిల్లులపై చర్యలు

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేపడుతుండగా.. ఇప్పటి వరకు ఎనిమిది రైస్ మిల్లుల యాజమాన్యాలపై చర్యలకు ఉపక్రమించారు. అధికారికంగా విడుదల చేసిన సమాచారం మేరకు వర్ని మండలంలోనే ఏకంగా ఐదు రైస్ మిల్లుల్లో పేరుకుపోయిన సీఎంఆర్ బకాయిల మేరకు నాలుగు రైస్‌మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదుచేయడం గమనార్హం. ఇందులో ఎంఎస్ఆర్ ఆగ్రో ఇండస్ట్రీస్, రాయల్ ట్రేడింగ్ కంపెనీ, ఎస్ఎఆర్ ట్రేడర్స్, వాసి పారాబాయిల్డ్ రైస్ మిల్, గంగా రైస్ మిల్లులున్నాయి. నిజామాబాద్ రూరల్ మండలంలోని కాలూర్ శివారులో లక్ష్మీ గణపతి నర్సింహ ఆగ్రో ఇండస్ట్రీస్, బోధన్ మండలంలోని శ్రీనివాస నగర్‌లోని దాదా భాయ్ ఇండస్ట్రీస్, పోతంగల్ మండలం కారేగావ్‌లోని అర్కామ్ ట్రేడర్స్‌లపై క్రిమినల్ కేసులు నమోదుచేశారు. మొత్తం ఎనిమిది రైస్ మిల్లుల నుంచి రూ.33 కోట్ల మేర బకాయిలు రావాల్సి ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. అత్యధికంగా గంగారైస్ మిల్ నుంచి రూ.8.09 కోట్లు, రాయల్ ట్రేడింగ్ కంపెనీ రూ.6.48 కోట్లు, ఎంఎస్ఆర్ ఆగ్రో ఇండస్ట్రీస్ రూ.5.05 కోట్ల బకాయిలు ఉన్నాయి.

# కాషాయంలో కాసుల లొల్లి




- బీజేపీలో దుమారం రేపుతున్న పార్టీ ఫండ్
- అసెంబ్లీ ఎన్నికల్లో చక్రం తిప్పిన ఓ కీలకనేత
- పార్టీ ఫండ్ దుర్వినియోగం చేసినట్లు ప్రచారం
- లెక్కలు చెప్పాలంటూ నిలదీస్తున్న ముఖ్య నేతలు

**భారతీయ జనతా పార్టీలో రోజుకో వివాదం తెరమీదికి వస్తున్నది. తాజాగా అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఫండ్ చిచ్చు రేపుతున్నది. అధిష్టానానికి అన్నీ తానే అంటూ ప్రగల్భాలు పలికే ఓ ప్రజాప్రతినిధి ఈ వ్యవహారంలో చక్రం తిప్పినట్లు ప్రచారం జరుగుతున్నది.**

**–నిజామాబాద్, జనవరి 25**
**(నమస్తే తెలంగాణ ప్రతినిధి)**

బీజేపీలో దాదాపు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో తనదే బాధ్యత అన్నట్లుగా పార్టీ ఫండ్‌ను గుప్పిట్లో పెట్టుకున్న కీలక నేత... ఎన్నికల ముంగిట అభ్యర్థుల ఖర్చులకు పార్టీ ఇచ్చిన మొత్తాన్ని పంపిణీ చేయలేదని తెలుస్తోంది. ఈ వ్యవహారం ఇప్పుడు బీజేపీలో తీవ్ర చర్చనీయాంశం అవుతున్నది. కాంగ్రెస్‌తో కుమ్మక్కులో భాగంగానే ఇదంతా జరిగిందా? లేదంటే పార్టీ ఫండ్‌ను నొక్కేద్దామనే దురాలోచనతో చేశారా? అన్నది ఇప్పుడు తేలాల్సి ఉంది. సదరు కీలక నేతకు కాంగ్రెస్‌తోనూ లోతైన సంబంధాలు, మూలాలు వేళ్లానుకొని ఉండడంతో ఇదంతా నిజమే కావొచ్చని సొంత పార్టీ నేతలే అభిప్రాయ పడుతున్నారు. పార్టీ ఫండ్ బొక్కేసిన లీడర్లు ఎవరన్నది ఇప్పుడు ఆసక్తిగా మారింది. అసెంబ్లీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కాషాయ పార్టీ మొన్నటి పోరులో పెద్ద ఎత్తున ఖర్చు పెట్టింది. ఇందులో భాగంగా కీలక నేతలకు బాధ్యతలు అప్పగించింది. ఈసీ నిబంధనల మేరకు రూ.40లక్షలను అధికారికంగా ఇచ్చి అనధికారిక ఖర్చుల నిమిత్తం ఓ ప్రజాప్రతినిధికి భారీగా డబ్బులు అప్పగించినట్లు సమాచారం. కానీ సదరు నాయకుడు ఈ మొత్తాన్ని పంపిణీ చేయకుండా మింగేసినట్లు బీజేపీలోని కీలక నేతలు బాహాటంగానే చెప్పుకుంటున్నారు. మీకు పార్టీ టికెట్ ఇవ్వడమే గొప్పా... పార్టీ ఫండ్ ఇచ్చేది లేదన్నట్లుగా సదరు నాయకుడు వ్యవహరించినట్లుగా తెలుస్తున్నది. ఈ వ్యవహారంపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో బీజేపీలో ఆత్మశోధన మొదలైంది.

### అధిష్టానానికి తప్పుడు లెక్కలు..

బీజేపీలో 2019 నుంచి నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో కీలకంగా మారిన సదరు వ్యక్తి ద్వారా పార్టీకి లాభం కన్నా నష్టం జరిగిందనే వాదన పెద్ద ఎత్తున వ్యాప్తి చెందుతున్నది. తనను తాను ఫైన్ కావడం కోసం వివాదాస్పద వ్యాఖ్యలు చేసి వివాదాలకు కేంద్రంగా నిలవడం మినహా బీజేపీ కార్యకర్తలకు అండగా నిలిచిన దాఖలాలు లేవు. తప్పుడు హామీలతో దక్కించుకున్న పదవితో ప్రజల్లో వైషమ్యాలు పెంచి పోషించడమే కానీ ఎన్నడూ బీజేపీ సిద్ధాంతాలను, కేంద్ర సర్కారు పథకాల అమలు, ప్రజల అవసరాలను గుర్తించడంలోనూ వైఫల్యం చెందినట్లు బీజేపీ గుర్తించింది. దీనికి తోడు కాషాయ జెండాలు మోసిన వారికి ప్రాధాన్యం ఇవ్వకపోవడం, వారిని హీనంగా చూడడం వంటి ఘటనలు నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో బీజేపీ నేతల్ని కలిచివేస్తున్నాయి. అధిష్టానం పెద్దలంతా సదరు కీలక నేత మాటల్నే నమ్మి కింది స్థాయి పరిస్థితులను అంచనా వేయడంలో వైఫల్యం చెందినట్లుగానూ శ్రేణులంతా మథన పడుతున్నారు. తప్పుడు లెక్కలు చూపించి తిమ్మిని బమ్మిని చేసి అగ్ర నాయకత్వాన్ని వక్రమార్గంలో నడిపించారని గుసగుసలాడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం వచ్చిన ఫలితాలతో కీలక నేతకు సంబంధించిన మాటలన్నీ నీటి మూటలు కావడంతో ఇన్ని రోజులపాటు జరిగిన తంతును ఢిల్లీ నేతలు కూడా గ్రహించినట్లు తెలుస్తున్నది.

### పార్టీ ఫండ్ దుర్వినియోగం?

బీజేపీలో పార్టీ ఫండ్ దుర్వినియోగం అంశం అంతటా చర్చనీయాంశం అవుతున్నది. అసెంబ్లీ ఎన్నికల్లో ఆశాజనకమైన ఫలితాలు రాకపోవడంతో ఈ మధ్యే బీజేపీ రాష్ట్ర, కేంద్ర కమిటీ బాధ్యులు రివ్యూ మీటింగ్‌లు నిర్వహించారు. ఇందులో పార్టీ ఫండ్‌కు సంబంధించిన అంశమే పెద్ద ఎత్తున చర్చకు దారితీసినట్లు తెలుస్తోంది. కమలం పార్టీ గుర్తుపై పోటీ చేసిన అభ్యర్థులకు పార్టీ నుంచి దక్కాల్సిన 'మద్దతు' అందలేదని పలువురు వాపోయినట్లు తెలిసింది. అధిష్టానం లోతుగా అధ్యయనం చేయగా నోట్ల కట్టల పంపిణీలో భేదాలు చూపడం, గెలిచే చోట ఆర్థికంగా ఆదుకోకపోవడం వంటివి పలువురు ప్రస్తావించారు. పార్టీ ఫండ్‌ను అందరికీ సమాన స్థాయిలో ఇచ్చినట్లుగా రాష్ట్ర, కేంద్ర నాయకత్వం గుర్తించగా అభ్యర్థుల చేతికి అంచనా వేసిన మొత్తంలో పంపిణీ జరగలేదని గుర్తించినట్లు సమాచారం. దీనికి కారకులు ఎవరు? ఏ కారణం చేత పార్టీ ఫండ్‌ను అభ్యర్థులకు ముట్టజెప్పలేదన్న అంశాలపై ముఖ్య నాయకులంతా ఆరా తీశారు. డబ్బులు ఇవ్వలేదని తేలడంతో కీలక నేత పేరు ప్రధానంగా చర్చకు వచ్చింది. సామాన్య కార్యకర్తలకు టికెట్లు ఇస్తే వారిని పార్టీ ఆర్థికంగా ఆదుకోవాల్సి వస్తుంది. అదే ఆర్థికంగా బలమైన వ్యక్తులనే బరిలో నిలిపితే పార్టీ ఫండ్ ఇచ్చినా ఇవ్వకున్నా ఏం కాదన్న అభిప్రాయంతోనే భారీ స్కెచ్‌ను ఓ కీలక నేత ముందస్తుగానే వ్యూహాలు రచించినట్లుగానూ ప్రచారం జోరుగా జరుగుతున్నది.


గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు
కామారెడ్డి జిల్లా ప్రజలకు, విద్యార్థిని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, నాయకులకు, అధికారులకు
గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు...
"We lay the foundation for your child's bright future"
KAKATIYA GROUP HYDERABAD
KAKATIYA HIGH SCHOOLS
ENGLISH MEDIUM Recognised by Govt.TS ...Gateway for IIT-JEE, Medical & Olympiad
Tadkole Road, Banswada, Cell:9059083232, 9866724675, 9618763560
NURSERY to X CLASS, E/M

గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు
కామారెడ్డి జిల్లా ప్రజలకు, విద్యార్థిని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, నాయకులకు, అధికారులకు
గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు...
VASAVI HIGH SCHOOL
Nursery to X Class E/M
Opp: TTD Kalyana Mandapam, Tadkol Road, BANSWADA. 9949125365, 9502944365




గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు
కామారెడ్డి జిల్లా ప్రజలకు, విద్యార్థిని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, నాయకులకు, అధికారులకు
గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు...
కామారెడ్డి పట్టణ ప్రజలు